క్లుప్తంగా

కేతేపల్లి వాసికి డాక్టరేట్



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన కృష్ణమ్మ, వర్ధన్‌గౌడ్ దంపతుల కుమారుడు వెంకటేష్‌గౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. వృక్షశాస్త్రంలో డ్రాగన్ ఫ్రూట్ యొక్క శాఖీయ ప్రత్యుత్పత్తి మరియు ప్రథమ, ద్వితీయ జీవక్రియలు, జన్యు వైవిధ్యం గూర్చి పరిశోధన చేశారు. ఈ అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్ కర్ణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో థీసిస్ సమర్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అతడు రంగారెడ్డి జిల్లాలోని పీఎంఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పట్టా పొందిన వెంకటేష్‌గౌడ్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

విద్యార్థినికి సన్మానం



వనపర్తి రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని కిష్టగిరికి చెందిన ఎం ఆంజనేయులు కుమార్తె నవ్యను గురువారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సన్మానించారు. ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదివిన నవ్య 557 మార్కులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మనాయక్, వెంకటయ్య, చిట్యాల రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు స్ప్రింక్లర్ పరికరాల పంపిణీ



వీపనగండ్ల: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో 31 మందికి సబ్సిడీ ద్వారా వచ్చిన స్ప్రింక్లర్ పరికరాలను గోపల్‌దిన్నెలో పంపిణీ చేసినట్లు మాజీ సింగిల్‌విండో చైర్మన్ బాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గోపల్‌దిన్నెలో 31 మందికి స్ప్రింక్లర్ పరికరాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇసుక వేలం వాయిదా

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో అధికారులు సీజ్ చేసిన ఇసుక వేలం వాయిదా వేసినట్లు తహసీల్దార్ సుగుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిమాడలోని వాటర్ ట్యాంకు వద్ద డంపు చేసిన 42 ట్రాక్టర్ల ఇసుకను ఇటీవల అధికారులు సీజ్ చేశారు. ఈ ఇసుకను గురువారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు అధికారులు ప్రకటన చేశారు. కానీ వేలానికి ఎవ్వరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేశామన్నారు. మరో మారు వేలం నిర్వహించేందుకు తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

పాన్‌గల్: తెలుగుదేశం పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా బుసిరెడ్డిపల్లికి చెందిన సీనియర్ నాయకుడు కొమారి దేవేందర్‌నాయుడుకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డబస్వపూర్ సుధాకర్‌నాయుడు నియామకపత్రం అందించారు. ఉపాధ్యక్షులుగా బాలునాయక్, ప్రధాన కార్యదర్శులుగా నర్సింహానాయుడు, బుచ్చిరెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శులుగా తెలుగు క్రిష్ణ, కృష్ణయ్యయాదవ్, వెంకటయ్య కార్యదర్శులుగా రామకృష్ణ నాయుడు, బాలకృష్ణయాదవ్, కోశాధికారిగా భూపేష్‌నాయుడు ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడిన వృద్ధుడు

గోపాల్‌పేట: కొద్ది రోజులుగా మండలంలోని బుద్దారంలో బిక్షాటన చేస్తూ కాలం గడుపుతున్న ఓ వృద్ధుడిని గురువారం బుద్దారం బస్టాండు సమీపంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు కాగా గుర్తించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో వృద్ధుడిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి గురించి సమాచారం తెలిస్తే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని గ్రామస్తులు కోరారు.

ధాన్యం డబ్బులకు ఎదురుచూపులు

- మండలంలో రూ.7.63 కోట్ల బకాయిలు
- రైతుల ఇక్కట్లు
- కేంద్రాల్లో పేరుకపోయిన ధాన్యం నిల్వలు



దావాజిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు



పాన్‌గల్ కేంద్రంలో ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు (ఫైల్)

పాన్‌గల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు దాటినా డబ్బులు రెగ్యూలర్‌గా అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారులకు చెల్లించేందుకు, ట్రాక్టర్ కిరాయి, వరి కోతకు, హమాలీలకు, ఇతర పెట్టుబడులు చెల్లించలేక అగచాట్లు పడుతున్నారు. ధాన్యం కాంటా చేసిన వెంటనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెబుతున్నా వారి హామీలు అమలు కావడంలేదు. ధాన్యం కాంటా చేసి 20 రోజులు దాటినా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో బ్యాంకు, సింగిల్ విండో, ఐకేపీ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం

మండలంలోని చాలా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతుండటంతో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా కాంటా చేయకపోవడంతో ధాన్యం కాపాడుకోవడం ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు సంభవిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కాంటా వేడుకుంటున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో 6వేల బస్తాలు, సింగిల్ విండో ఆధ్వర్యంలో 15 వేల బస్తాల ధాన్యం నిల్వలు పేరుకపోయాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మండలంలో..

కొనుగోలు కేంద్రాలు	రైతులు	సేకరించిన ధాన్యం (క్వింటాళ్లలో..)	చెల్లించాల్సిన డబ్బులు (రూ.కోట్లలో..)
14 కేంద్రాలు (ఐకేపీ)	285	17,061	రూ.2.45
23 కేంద్రాలు (సింగిల్‌విండో)	473	83,800	రూ.5.18

నెల రోజులైనా కాంటా లేదు



వరి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి నెల రోజులైనా నేటికీ కాంటా చేయకపోవడంతో కేంద్రంలోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తేమ శాతం వచ్చినా.. లారీలు రావడం లేదని సేకరణలో జాప్యం చేస్తున్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం కాపాడుకోవడం ఇబ్బందిగా మారింది.

– లక్ష్మీదేవమ్మ, తెల్లరాళ్లపల్లి

డబ్బులు జమ కాలేదు



సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి 15 రోజులు అవుతున్నా డబ్బులు నేటికీ ఖాతాలో జమకాలేదు. దీంతో డబ్బుల కోసం ప్రతి రోజు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– తిరుపతిరెడ్డి, పాన్‌గల్

ఉన్నతాధికారులకు నివేదించాం



రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు నివేదించాం. మా సొసైటీ ద్వారా సేకరించిన ధాన్యానికి సంబంధించి 473 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వారిలో ఇప్పటి వరకు 200 మందికి రూ.3 కోట్ల వరకు ఖాతాల్లో జమ చేశాం. మిగితా రైతులకు సంబంధించి రూ.5.18 కోట్లు ఒకటి, రెండు రోజుల్లో జమ అవుతాయి.

– భాస్కర్‌గౌడ్, పీఏసీఎస్, సీఈఓ, పాన్‌గల్

పొంచి ఉన్న ప్రమాదం



ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇళ్లపై వేలాడుతున్న తీగలు



మైలారంలో కంచెలేని మినీ ట్రాన్స్‌ఫార్మర్లు

కోడేరు: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇళ్లపైనే చేతికి అందె ఎత్తులో తీగలు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

పల్లు గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. చిన్నపాటి వర్షం, ఈదురుగాలులకు తీగలు రాపిడి జరిగి మంటలు చెలరేగగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లను తొలగించాలని ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మైలారం, నాగులపల్లితండా, నాగుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, తదితర గ్రామాల్లో ఇళ్లపైనే విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. ఇంటిపైకి వెళ్లేందుకు జంకుతున్నారు. చిన్నారులు ఇళ్లపైకి పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కొందరు ఇళ్లపైకి వెళ్లి విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారని కాని ఇప్పటికి అధికారులు తీగలు మార్చడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు.

ఇళ్ల మధ్యనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

మండల కేంద్రమైన కోడేరు బీసీ కాలనీ, మైలారం, నాగులపల్లి, నర్సాయిపల్లి, తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. చిన్నపాటు వర్షానికే ఫ్యూజులు కాలిపోయి అంధకారంలో మగ్గాల్సిన దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు ప్రమాదాలబారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తీగలు తొలగించాలి



మండలంలోని ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించి ఇళ్లకు దూరంగా ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేయాలి. ఇళ్లపై విద్యుత్ తీగలు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రఘు, నాగులపల్లి

కంచె ఏర్పాటు చేయాలి



ఇండ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలి. కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, కోడేరు

సమస్యలు పరిష్కరిస్తాం

మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– ప్రదీప్‌గౌడ్, ఏఈ, కోడేరు

పూజారి హఠాన్మరణం



పూజారి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఓ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న మఠం గంగాధర్(35) బుధవారం రాత్రి హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఆయన ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో జరిగే శుభకార్యాల్లో అర్చకుడిగా పనిచేసిన గంగాధర్ లేడనే విషయాన్ని పట్టణ ప్రజలు జీర్ణించుకోలేపోతున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, కృష్ణారెడ్డి, బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బాలరాజు, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



ఉపాధి కూలీలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వీపనగండ్ల: సైబర్ నేరాలు, మోసగాళ్లతో గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గురువారం తెలంగాణ సాంస్కృతిక సాహితి కళాకారులు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. గురువారం బొల్లారం శివారులో పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు వడదెబ్బ నివారణ చర్యలు, రాజీవ్ యువవికాసం, భూ భారతి చట్టం, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి తమ ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో టీం అధ్యక్షుడు బోనాసి రాజు, కళాకారులు ఎస్ నర్సింహ, కృష్ణయ్య, ఎస్ శ్రీనివాసులు, లింగమయ్య, సువర్ణ, రాధ, శ్రీదేవి పాల్గొన్నారు.


తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



చాకల్‌పల్లిలో తడిసిన వరిధాన్యం

గోపాల్‌పేట: వరి కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని గురువారం చాకల్‌పల్లి రైతులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చాకల్‌పల్లితో పాటు ఉమ్మడి మండలంలో చాలా చోట్ల ఇప్పటికే కొనుగోలు చేసిన వరిధాన్యం, కుప్పలుగా ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని, తడిసిన ధాన్యం వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం జీఎమ్మార్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'జీఎమ్మార్ చలివేంద్రం' ద్వారా పట్టణ కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చుతామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు తెలిపారు. చలివేంద్రంలో చల్లటి తాగునీరుతో పాటు మజ్జిగ, అంబలి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాచాల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి



వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న జీఎస్ గోపి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్తున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించాలని, వారికి ఏడాదికి రూ.12,500 చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర చెరుకు సంఘం అధ్యక్షుడు జీఎస్.గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 20 జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రతి శ్రామికుడు, కూలీలు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ గురువారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఉపాధి హామీ కూలీలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం వరిధాన్యానికి కూడా బోనస్‌గా రూ.500 చెల్లించాలని కోరారు. మిల్లర్లు తేమ, తాలు, చెత్త పేరుతో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్, హమాలీ వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలని కోరారు. అకాల వర్షాల కారణంగా రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, అంజిరెడ్డి, మొగిలన్న, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

నాడు వరి వేస్తే ఉరి.. నేడు సిరి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

- మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్
- సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే..

వనపర్తిటౌన్: బీఆర్‌ఎస్ పాలనలో వరి సాగుచేసిన రైతులకు ఉరి తప్పదని నాటి సీఎం కేసీఆర్ అన్నారని, కానీ నేడు ప్రజా పాలనలో వరి సాగు చేసిన రైతు ఇంటిలో సిరుల వర్షం కురుస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ బి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిషన్లు లేని షెడ్లకు రైస్‌మిల్లు అనుమతులు ఇచ్చిన ఘనత మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. అన్నదాతల అవస్థలకు కారణం బీఆర్‌ఎస్ పార్టేనన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లపై మాజీ మంత్రి మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందని, పదేళ్లుగా ఇష్టానుసారంగా వ్యవహరించి 150 రైస్ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో చేర్పించిన ఘనత నిరంజన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

వనపర్తి జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోళ్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. 200 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 300 లారీలతో నిత్యం ధాన్యాన్ని గోదాంలకు తరలిస్తున్నామన్నారు.

రైతుల ముసుగులో..

రైతుల ముసుగు తొడుక్కున్న కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి రైతులను రాజులను చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పెబ్బేరు మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శంకర్ ప్రసాద్, వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, సత్యశీలా రెడ్డి, వెంకట్రాములు, శ్రీహరిరాజు, రవికిరణ్, రవినాయక్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు గోదాంకు తరలింపు



పాన్‌గల్‌లోని గోదాం వద్ద ధాన్యం బస్తాల లారీలు

పాన్‌గల్: మండలంలోని ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను మండల కేంద్రంలోని గోదాం కు తరలించి నిల్వ చేస్తున్నారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం బస్తాల నిల్వలు పేరుకపోతున్నాయనే విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జిల్లా అధికారులను ఆదేశించి కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను గోదాంలో నిల్వ చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలన్నారు. దీంతో రెండు రోజుల నుంచి గోదాంలో ధాన్యం బస్తాలను నిల్వ చేస్తున్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల లోడ్‌తో వచ్చిన లారీలు గోదాం వద్ద బారులు తీరాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



అమరచింత: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌తో కలిసి డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ 28 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తారన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మహంకాళి విష్ణు, తిరుమలేష్, పోసిగిగారి విష్ణు, హనుమంతు నాయక్, తౌఫిక్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

కొత్తకోట రూరల్: మండలంలోని పాముపురం శివారులో గల ఊకచెట్టు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొత్తకోట పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. పాముపురం గ్రామానికి చెందిన గుజ్జుల శేషన్న ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను వనపర్తికి తరలిస్తుండగా గురువారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నాటవెళ్లి శివారులో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో మట్టి, ఇసుక అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

పీజేపీ క్యాంపు సమీపంలోని సంపద వనం



'బృహత్' వనం.. వాడుముఖం

మండలానికో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షించే చర్యలు తీసుకున్న అధికారులు.. ప్రస్తుతం వాటికి నీరు అందించలేకపోతున్నారు. దీంతో నాటిన పదివేల మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్యాంపు సమీపంలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన బృహత్ పల్లెప్రకృతి వనంలో పదివేల మొక్కలు నాటి సంరక్షించారు. ప్రస్తుతం ఈజీఎస్ ద్వారా మెంటెనెన్స్ గడువు పూర్తయిందని పంచాయతీకి సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. రోజువారి మొక్కలకు నీటిని అందించలేక పోవడంతో అవి ఎండుపుల్లలుగా దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు సంపద వనాల పరిస్థితి సైతం అదే విధంగా తయారయ్యింది.

– అమరచింత